

# ఏటి ఒడ్డున నీటిపూలు

## - కోలిపాక రమామణి



రమామణిగారు 29 యేళ్ళ వయసులో వ్రాసిన మొదటి నవల ఈ 'ఏటి ఒడ్డున నీటిపూలు'. పోటీల్లో బహుమతి గెలుచుకుంది. తర్వాత కన్నడపత్రికలో అనువాదమై సీరియల్ గా వచ్చింది. అప్పుడు పుస్తకరూపంలో వెలువడింది. ఆ తర్వాత నాలుగైదు సంవత్సరాల వ్యవధిలోనే 'వెన్నెల్లో పిల్లనగ్రోవి', 'గడ్డిపోచలు','హాలాహలంలో అమృతం' లాంటి పాఠకాదరణ పొందిన నవలలు వ్రాశారు. అప్పటి అన్ని ప్రముఖపత్రికలలోను, ఆకాశవాణికి కథలు కూడా వ్రాశారు.

(గత సంచిక తరువాయి)

ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల (1968)

శంకరం పరీక్ష తప్పాడని తెలిశాక విశాఖపట్నం నుంచి రేవతి ఉత్తరం వ్రాసింది. భగవతిని విశాఖ పంపమనీ, తమ దగ్గిర పెట్టుకుని చదివించుతామనీ రాసింది. తమ డబ్బు ఇబ్బందులు తెలుసుకుని పెద్ద కూతురు భగవతిని పంపమని రాసిందని గ్రహించింది శాంతమ్మ. నిజంగా ఇబ్బందులు ఉన్నప్పుడు సిగ్గు పడితే ప్రయోజనం లేదు. ఇప్పుడు పంపక పోతే అనవసరంగా భగవతి చదువు పాడవుతుంది. భగవతి ఆ ఏడు ఫిఫ్తు ఫారంలోకి వచ్చింది. అందరిలోకీ చిన్నది, ఆఖరి కూతురు. తండ్రికి ముద్దుల కూతురు అయిన భగవతిని దూరం చేసుకోవడానికి మనస్సులో ఎంతో బాధపడింది శాంతమ్మ.

శంకరం వెళ్లి సామర్లకోటలో భగవతిని రైలు ఎక్కించాడు. రేవతి, భర్త వచ్చి విశాఖపట్నంలో దించుకున్నారు.

భగవతి ఒక్కర్తీ వెళ్లి పోవడం వల్ల ఇంట్లో డబ్బు ఇబ్బందులు ఏమీ తగ్గలేదు. ఆ ఏడు మూడు నెలలు విపరీతమైన ఎండలు కాయడం వల్లేమో ముసలమ్మకి సుస్తీ చేసింది. ఇంటి పరిస్థితులే ఆలోచిస్తూ డాబా మీద కూర్చున్న చారుమతికి, "అక్కా! నీకు ఉత్తరం వచ్చింది" అంటూ ఒక కార్డు ఇచ్చింది మాలతి. విజయనగరం నుంచి గోపాల్ రాశాడు.

"చారుమతి వదినకు, మా ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షా ఫలితాలు తెలిశాయి. నేను పాసయ్యానని రాయడానికి సంతోషిస్తున్నాను. ఇదంతా మామ్మయ్య చలవ, మీ చలవ. దీనికి నేనూ, అమ్మా కృతజ్ఞులం. నాకు ఇక్కడే ఒక వేరుసెనగ మిల్లులో గుమాస్తా ఉద్యోగం దొరికింది. అమ్మ అత్తకు, అమ్మమకి నమస్కారాలు రాయమంది.

ఇట్లు

గోపాల్"

"పోనీలే. ఏదో ఉద్యోగం దొరికింది. ఇతనూ డబ్బు పంపమంటే ఎక్కడినించి తేవడం?' అనుకుంది చారుమతి.

"ఏమిటంత దీర్ఘాలోచనా?" అంటూ డాబా మీదికి వచ్చారు శ్రీదేవి, పద్మ.

"ఏమీ లేదు. రండి రండి" అంటూ ఆహ్వానించింది చారుమతి

ఇద్దరూ వచ్చి కూర్చున్నారు ఏం మాట్లాడాలో, ఎవరు ప్రారంభించాలో తెలియక ముగ్గురూ నిశ్శబ్దంగా ఉండి పోయారు. పూర్వమైతే, "ఆ పుస్తకం చదివావా?", " ఆ కథ ఎలా ఉంది?", "ఈ గేయం బాగుంది కదూ?" అంటూ ముగ్గురూ ఒక్కసారే సాహిత్య చర్చ మొదలు పెట్టేవారు. చారుమతి సంసార బాధ్యతలూ, పద్మ మౌనం శ్రీదేవిని కూడా తికమక పెడుతున్నాయి ఇప్పుడు.

"ఏమిటి విశేషాలు?" చారుమతే మొదలు పెట్టింది సంబాషణ.

"నువ్వు చెప్పాలి. మాకు విశేషాలు ఏముంటాయి? నేను, పద్మ రోజూ కాలేజీకి వెళ్లి వస్తున్నాం మామూలుగా" అంది శ్రీదేవి.

"పద్మా! నువ్వు వేసంగి సెలవులలో మద్రాసు వెళ్ళలేదా? ఏం?" అంది చారుమతి.

"వెళ్ళలేదు. తను ఆఫీసు పని మీద ఢిల్లీ వెళ్లారట" అంది పద్మ. అబద్ధం కావాలనే చెప్పింది, అత్తగారు కాని, భర్త కాని తనని మద్రాసు రమ్మంటూ ఒక్క ఉత్తరం కూడా రాయలేదని చెప్పలేక.

శ్రీదేవి మళ్ళీ చారుమతిని అడిగింది ఇంటి విషయాలు చెప్పమంటూ. 'స్నేహితులకి కాకపోతే ఎవరికీ చెబుతాను?' అనుకుంది చారుమతి. ఇంటి విషయాలు ఒకటొకటిగా అన్నీ చెప్పింది. శంకరం పరీక్ష తప్పడం. భగవతిని విశాఖపట్నం పంపడం, ముసలమ్మ వైద్యానికైన అప్పు.

"ఇప్పుడు మాలతి చదువు పెద్ద సమస్య అయిపొయింది దేవీ! ఎస్.ఎస్.ఎల్.సి. లోకి వచ్చింది. స్కూలు ఫీజుకి హెడ్ మిస్ట్రెస్ కన్సెషన్ ఇస్తానన్నా, పుస్తకాలన్నీ కొనవద్దా? ఈ ఏడు మానిపించేదామనుకుంటున్నాను. వచ్చే ఏడాది శంకరం ఉద్యోగంలో చేరితే, మాలతిని చదివించ వచ్చు" అంది చివరికి.

"మాలతిని మానిపించవద్దు. ఈ ఏడాది పూర్తి చేసెయ్య నియ్యి" అంది శ్రీదేవి.

"ఆలోచిస్తాను. చదువు మానేయ్యమంటే మాలతి చిన్నబుచ్చుకుంటుందేమో!" అంది చారుమతి.

చారుమతి ఇంటి సమస్యలనే ఆలోచిస్తూ ముగ్గురూ మౌనంగా కూర్చున్నారు.

"డబ్బు ఎక్కువ ఎలా సంపాదించడం అన్నదే నాకు రాత్రీ పగలు ఆలోచన." నవ్వుతూ అంది చారుమతి. అది ఏడవలేక నవ్వినట్టుంది.

"చారూ! నువ్వు ఏమీ అనుకోనంటే నేనొక సలహా చెబుతాను. మీ ముందరి గది ఎవరికైనా అద్దెకి ఇవ్వకూడదూ? పదిహేను ఇరవై రూపాయలు వస్తాయి" అంది పద్మ.

"ఈ ఆలోచన బాగానే ఉంది పద్మా. ఇన్నాళ్ళూ నాకు తట్టనే లేదు" అంది చారుమతి.

ఆ రాత్రి భోజనాల దగ్గిర చారుమతి ముందుగది అద్దెకి ఇవ్వడం విషయం మిగతా వాళ్ళతో చర్చించింది.

"ముందు గది అద్దెకి ఇస్తే ఎలా? మనందరికీ ఒక్క గది ఎలా సరిపోతుంది?" అన్నాడు శంకరం.

"నిజమే, కష్టమే" అంది చారుమతి, గది అద్దెకి ఇస్తే ఎలా ఉంటుందో ఊహించుకుంటూ.

వాళ్ళ ఇంట్లో ఉన్నవి రెండు గదులు. ముందర వీధి గది, దాని వెనక దానికంటే కొంచెం పెద్దగది. వెనక వరండా. వరండానీ, వంటిల్లునీ వేరుచేస్తూ చిన్న పెరడు. వంటింటిని ఆనుకుని ఒక పక్క స్నానాల గది. వెనక పాయిఖానా దొడ్డి. ముందు గదిలో అద్దెకి ఉన్నవాళ్ళు స్నానాల గదికి వెళ్ళాలంటే ఇంటి పక్కనున్న సన్నటి సందుకుండా వెనక పెరడులోకి వెళ్ళాలి. పోతే, ముందు గది అద్దెకి ఇచ్చేస్తే ఇంటివాళ్ళు ఇంట్లో ప్రవేశించాలన్నా పక్కసందు గుండా లోపలి పెరడు వైపు వెళ్లి, ప్రవేశించాలి. అద్దెకున్న వాళ్ళూ, ఇంటివాళ్ళూ ఇబ్బంది పడాలి. ఇన్ని ఇబ్బందులు ఉన్నా అద్దెకి ఇవ్వాలి.

"మనం కొన్నాళ్ళు కష్టపడాలి, తప్పదు. డబ్బు మనకి అవసరం. నీకు ఉద్యోగం వచ్చే దాకా ఇబ్బంది పడాలి" అంది చారుమతి శంకరాన్ని చూస్తూ.

తన ఉద్యోగం ప్రసక్తి రాగానే మౌనం వహించాడు శంకరం.

"అద్దెకి ఎవరికిస్తాం?" అంది భానుమతి.

"ఎవరికేమిటి? స్టూడెంట్స్ కు"

"స్టూడెంట్స్ కీ, బ్రహ్మచారులకీ ఇస్తే మనకి తాటాకులు కడతారు అంతా. వయస్సులో ఉన్న పెళ్లి కాని అమ్మాయిలని ఇంట్లో పెట్టుకుని, బ్రహ్మచారులని అద్దెకి పెట్టుకుంటే నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటారు" అంది శాంతమ్మ.

"మరి ఎవరికి ఇస్తాం? ఉద్యోగులైన, ఒంటరిగా ఉన్న ఆడవాళ్ళకి ఇవ్వవచ్చును. కాని వాళ్ళు భోజనానికి హోటళ్ళకి వెళ్ళరు. వంటిల్లు కావాలి" అంది చారుమతి ఆలోచిస్తూ.

అద్దెకి ఎవరిని పెట్టుకోవడం అన్నది సమస్యగానే ఉన్నా, 'ఎవరికేనా గది అద్దెకి ఇస్తే బాగుండును. డబ్బు వస్తుంది' అన్న అభిప్రాయం అందరి మనస్సులలోనూ ఉండిపోయింది.

అన్నీ సమస్యలుగానే ఉండిపోయాయి. 'మాలతి చదువు ఏం చెయ్యడం?' మధనపడింది చారుమతి.

రెండు రోజుల తరువాత స్కూలు నుంచి ఇంటికి వచ్చేసరికి, మాలతి కొత్త పుస్తకాల దొంతర ఒకటి తెచ్చి అక్క ముందర పెట్టింది. స్కూలు ఫైనల్ క్లాసు పాఠ్యపుస్తకాలు, నోట్సులు రాసుకోవడానికి బౌండు నోటు పుస్తకాలు ఉన్నాయి అందులో.

"ఎక్కడివి?' అంది ఆశ్చర్యంగా చారుమతి.

"శ్రీదేవి పంపించింది. ఇదిగో, ఈ ఉత్తరం కూడా పంపింది" అంటూ చిన్న కాయితం ఇచ్చింది. రెండే పంక్తులు రాసి ఉన్నాయి.

'ప్రియమైన చెల్లెలు మాలతికి,

ప్రేమతో అక్క శ్రీదేవి."

చారుమతికి కోపం వచ్చింది. తమ లేమి తలుచుకుని దుఃఖం వచ్చింది. వెంటనే శ్రీదేవి ఇంటికి వెళ్ళింది. శ్రీదేవి జాజిపూలు మాల కడుతూ ఉంది.

"ఇలాగేనా అవమానించడం?" అంది చారుమతి లోపలి వస్తూనే.

"అవమానించడం ఏమిటి? అలా నుంచునే మాట్లాడతావా? ముందు కూర్చో" అంది శ్రీదేవి.

"మాకు లేదని దానాలు చేస్తున్నావా? ఇంటి విషయాలు, ఇబ్బందులు మీతో చెప్పానంటే, సహాయం అర్థించి కాదు. అన్నీ చెప్పడం నా బుద్ధి తక్కువ" అంది రోషంగా చారుమతి.

"ఇందులో అవమానాలు, బుద్ధి తక్కువలు ఏమిటో తెలియటం లేదు. చారూ! ఒక స్నేహితురాలికి ఇంకో స్నేహితురాలు సహాయపడటం తప్పా?"

"తప్పే దేవి! డబ్బు ఇవ్వటం, సహాయం పుచ్చుకోవడం స్నేహితుల మధ్య వస్తే ఆ స్నేహం ఎంతో కాలం నిలవదు. మా ఇబ్బందులు ఎప్పుడూ ఉండేవే. దాని కోసం తియ్యటి మన స్నేహం పోగొట్టుకోవడం నాకిష్టం లేదు." చారుమతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

శ్రీదేవి మనస్సు చివుక్కుమంది.

"చారూ! నీకు మాలతి చెల్లెలైతే, నాకూ చెల్లెలే. చెల్లెలికి అక్క ఇవ్వడంలో తప్పు లేదు. అయినా, పుస్తకాలు పుచ్చుకోవడానికి నీకు అభ్యంతరం అయితే, డబ్బు ఉన్నప్పుడు బదులు తీర్చెయ్యి" అంది శ్రీదేవి, అప్పటికి చారుమతిని ఒప్పించవచ్చునని.

చారుమతి నిశ్శబ్దంగా కూర్చుంది కాసేపు. లేమిలోకి దిగజారి పోతున్న మధ్యతరగతి కుటుంబీకుల మానసిక వ్యధ ఊహాతీతమైనది.

12

సెప్టెంబరులో శంకరం పరీక్షకి కూర్చుని ఇంగ్లీషు మాత్రం పాసయ్యాడు. గ్రూపు మళ్ళీ తప్పాడు. "వీడికింత బుద్ధి లేదేం? శ్రద్ధగా చదివి పరీక్ష పాసవ్వాలని తెలీదా?" అని చిరాకు పడింది చారుమతి. శాంతమ్మ విచారించింది.

భానుమతి మాత్రం శంకరానికి వెనక మద్దతు. "దురదృష్టం, కష్టాలన్నీ ఒక్కసారే వస్తాయి" అంటూంది భానుమతి.

ముసలమ్మ మంచం మీద నించి లేవటం లేదు. అతి కష్టం మీద పాయిఖానాకీ, నీళ్ళు పోసుకోవడానికీ లేస్తుంది. ఆవిడ చెయ్యి పట్టుకు జాగ్రత్తగా నడిపించాలి. అత్తగారి సేవలన్నీ శాంతమ్మ మీదే పడ్డాయి. పూర్తిగా వంటపని భానుమతి చూసుకుంటూంది. ముసలమ్మ మందులకీ, శంకరం పరీక్షకీ డబ్బు అప్పు తెచ్చారు. అప్పులు తీర్చడం కోసం చారుమతి ప్రైవేట్లు చెప్పేది. ఉదయం అయిదుగురు, సాయంత్రం అయిదుగురు అమ్మాయిలు వస్తారు. ఇంత కష్టపడినా అదనపు ఆదాయం తక్కువే. ఇంట్లో పరిస్థితులు మరీ దిగజారి పోయాయి. చాకలిని పూర్తిగా మానిపించేశారు. మాలతి భానుమతి కలిసి రోజూ బట్టలు ఉతుకుతారు. చెల్లెళ్ళిద్దరి స్కూలు చీరలు గంజి పెట్టి ఆరవేసి, ఇస్త్రీ చేస్తుంది భానుమతి. సినిమాలు చూడడం మానేశారు. వారానికో, పదిరోజులకో సినిమా చూడకపోతే శంకరానికి ఉపవాసం చేసినట్టు ఎంతో వెలితిగా ఉండేది. కాని చెల్లెలు ముందర 'డబ్బు కావాలి' అంటూ చెయ్యి జాపడానికి సిగ్గు.

చారుమతి కంటె ఒక ఏడు పెద్దవాడు శంకరం. తక్కిన ఇద్దరు చెల్లెళ్ళూ "అన్నా" అని పిలిచినా, చారుమతి మాత్రం, "శంకరం" అనే పిలిచేది. చిన్నతనం నుంచి లేక లేక అబ్బాయి పుట్టాడని శంకరాన్ని ఇంట్లో తల్లీ, తండ్రీ, మామ్మా అపురూపంగా చూడటంతో చారుమతికి అన్న అంటే కొంచెం ఈర్ష్య. ఎప్పుడేనా కొంచెం లోపం శంకరంలో కనిపిస్తే చారుమతి దాన్ని పెద్దగా ఎత్తి చూపి ఎగతాళి చేసేది. ఎత్తి పొడిచేది.

డిసెంబరు నెలలో సూర్యారావు సంవత్సరీకాలు జరిపారు. తండ్రిని మరోసారి తలుచుకుని దుఃఖించారు అంతా.

"సంసార భారమంతా నా మీద పెట్టి, నువ్వెందుకు వెళ్ళి పోయావు నాన్నా" అంటూ ఒంటరిగా కూర్చుని ఏడ్చింది చారుమతి.

ఇంట్లో అప్పులు పెరుగుతున్నాయి. మాలతికి, శంకరానికి పరీక్షలకి డబ్బు కట్టాలని అప్పు తెచ్చారు. సూర్యారావు సంవత్సరీకాలు జరపడానికి శాంతమ్మ తన చేతి బంగారు గాజులు అమ్మేస్తూంటే చూసి బాధ పడ్డారు అంతా. తన నిస్సహాయ స్థితికి వ్యధ, శంకరం పరీక్షలు తప్పుతున్నందుకు కోపం వచ్చాయి చారుమతికి.

"అన్నిటికీ ఎందుకు బాధపడతావు చారూ? నారు పోసినవాడు నీరు పోస్తాడంటారు. రోజులు ఎలాగో అలా వెళ్ళిపోతాయి. నువ్వు దిగులు పడకు. మనసు కష్ట పెట్టుకోకు" అంటుంది భానుమతి.

భానుమతి స్థైర్యం లేదు చారుమతికి. భానుమతిలో ఏదో వేదాంతం ఉంది. ఏదీ విపరీతంగా తీసుకుని బాధ పడదు. "భగవంతుడే ఉన్నాడు పైన", "మనం చేసుకున్న కర్మ". " దురదృష్టం" అనే మాటలతో నిశ్చింతగా గడుపుతుంది. అక్క నిశ్చింత, గంభీరత్వం చూస్తే ఆశ్చర్యంగా ఉంటుంది చారుమతికి.

## 13

మే నెల వచ్చింది. మళ్ళీ మల్లెలు, మామిడిపళ్ళు వచ్చాయి. మాలతి ఎస్.ఎస్.ఎల్.సి., పద్మ ఇంటరు, శ్రీదేవి బి.ఏ. పరీక్షలు రాశారు.

మే ముప్పైయ్యవ తారీఖున శ్రీదేవి పెళ్ళికి ముహూర్తం పెట్టారు. శ్రీదేవికి పెళ్ళికొడుకు బావ వరస అవుతాడు. అతను ఇంజినీరు. హైదరాబాద్ లో ఉన్నాడు. శ్రీదేవికి దగ్గిరి వాడైనా వాళ్ళిద్దరూ కలుసుకోవడం తక్కువ. పెళ్లి దాకా అపరిచితులుగానే ఉండిపోయారు.

పెళ్లి ఇంకా మూడు రోజులు ఉందనగా చారుమతి, పద్మ కలిసి శ్రీదేవి ఇంటికి వెళ్ళారు. తన దగ్గిర చాలా రోజులు పెట్టుకుని చదివించడం వల్ల కలిగిన అభిమానంతో శ్రీదేవి మేనత్త పెళ్లి తమ ఇంట్లోనే జరగాలని కోరింది. వారి ఇంట్లో వెనక పెరడంతా శుభ్రం చేసి కొత్తగా ఇసుక పరిపించారు. పెద్ద పందిరి వేస్తున్నారు, ఇంటికి వెల్లలు వేసి, పచ్చటి మామిడాకు తోరణాలు కట్టారు. గుమ్మాలకు కొత్త రంగులు

వేశారు. ఆ రోజు శ్రీదేవిని పెళ్ళికూతురుని చేశారు. చారుమతి, పద్మ లోపలి వెళ్లేసరికి శ్రీదేవి అక్కలు ఆమెను అలంకరిస్తున్నారు. కళ్యాణబొట్టు, బుగ్గన చుక్కతో శ్రీదేవికి కొత్త అందం వచ్చింది. ముఖంలో సంతోషం కొట్ట వచ్చినట్టు కనిపిస్తూంది. దాచుకోవాలని ప్రయత్నించినా దాగని చిరునవ్వు. పెద్దక్క ప్రభావతి పూలజడ కుడుతూ ఉంటే, చిన్నక్క శ్రీదేవి కాళ్ళకి పారాణి రాస్తూంది.

"అబ్బ, ఇప్పుడా వచ్చారు?" అంది స్నేహితురాళ్ళను చూడగానే శ్రీదేవి.

"ఉదయం లేచిన దగ్గిర నించి మీ ధ్యాసే అయిపోయింది దీనికి. మరిదిగారి తలపే లేదు" అంది చిన్నక్క లక్ష్మీదేవి.

"పైకి మా పేర్లు చెబుతుందండీ. మనసులో అంతా ఆయన ధ్యాసే" అంది చారుమతి కూర్చుంటూ.

శ్రీదేవి సిగ్గుపడుతూ నవ్వింది. పద్మ కూడా చారుమతి పక్కనే కూర్చుంది. శ్రీదేవిని అలంకరిస్తునంత సేపు ఇద్దరక్కలు చెల్లెలిని పెళ్ళికొడుకు పేరు ఎత్తి ఏడిపిస్తూనే ఉన్నారు. మధ్య మధ్య వారి భర్తలు కూడా వచ్చి మరదలిని హాస్యం చేస్తున్నారు వాతావరణం అంతా ఎంతో సరదాగా, హాయిగా, ఆనందంగా ఉంది. ఇంటి నిండా చుట్టాలు వచ్చారు. ఇంకా వస్తున్నారు.

శ్రీదేవి ఇద్దరాడపిల్లల తరువాత పుట్టింది. ఆఖరి పిల్ల కావడంతో పెళ్లి పెద్ద ఎత్తున చేస్తున్నారు. శ్రీదేవికి అన్నదమ్ములు లేరు. కాని పెద్దమ్మ కొడుకులు, పిన్నమ్మ కొడుకులు చాలామంది ఉన్నారు. వాళ్ళే పందిరి అలంకరణ చూస్తున్నారు. రంగు కాయితాలతో అలంకరించడం, రంగు బల్బులు అమర్చడం, పెండ్లి ఫోటోలు తియ్యడం... సగం హడావిడి మగపిల్లలదే.

ఆ రోజంతా అక్కడే ఉండి, రాత్రి భోజనం చేసి ఇళ్ళకి బయలు దేరారు పద్మ, చారుమతి. పెళ్లి రెండు రోజులు తన దగ్గిరే ఉండాలని, ఊళ్ళో భగవతీ, మాలతీ ఎలాగా లేరు కనక, శంకరాన్నయినా పెళ్ళికి తీసుకురావాలని చారుమతిని మరీ మరీ కోరింది శ్రీదేవి. భానుమతి పైకి వెళ్ళటం మానుకుంది. ఎక్కడికీ వెళ్ళదు.

పద్మ రిక్షా ఎక్కి ఇంటికి వెళ్ళిపోయింది.

రాత్రి పది గంటలు అవుతూ ఉంది. అంత రాత్రి వేళ ఒంటరిగా నడిచి వెళ్ళలేక, చారుమతి రిక్షా కట్టించుకుంది. 'ఎన్నాళ్ళయింది రిక్షా ఎక్కి!' అనుకుంది మనసులో. సూర్యారావు పోయాక రిక్షా ఎక్కడం మానేశారు చారుమతి ఇంటివాళ్ళు. 'ఆ పావలా పెడితే ఒక కూర కొనుక్కోవచ్చును' అనిపిస్తుంది.

'శ్రీదేవి పెళ్ళికి ఎలా వెళ్ళటం? ఒక్క మంచి చీర లేదు. వెళ్ళకపోతే బాగుండదు. అది బాధ పడుతుంది. అందరూ చక్కటి ఖరీదైన పట్టు చీరలు కట్టుకుని వస్తారు. నేను వాయిల్ చీరతో వెళ్ళనా? మంచి వాయిల్ చీర కూడా లేదు. ఒక కొత్త చీర కొనుక్కుంటే బాగుండును. కొనడానికి డబ్బేది? బట్టలకొట్టు ముఖం చూసి ఏణ్ణర్థమైంది. ఇప్పుడే కాదు, ఈ జీతం, ఈ ఖర్చులతో ఎప్పటికైనా కొత్త చీర కొనుక్కోవడానికి సాధ్యమౌతుందా?' చారుమతి ఇల్లు చేరే దాకా మధన పడుతూనే ఉంది.

రిక్షా వాడికి డబ్బులు ఇచ్చి ఇంట్లో అడుగు పెట్టే సరికి ముసలమ్మ వరండాలో మంచం మీద నిద్రపోతూ కనిపించింది. వంటింట్లో దీపం వెలుగుతూ ఉంది. 'అమ్మ ఇంకా ఏం చేస్తూ ఉంది?' అనుకుంటూవంటింట్లోకి తొంగి చూసింది. శాంతమ్మ, భానుమతి భోజనం చేస్తున్నారు. చూస్తూ కొయ్యలా నిలబడి పోయింది.

"ఏం చారూ? ఎప్పుడు వచ్చావు? తలుపు శబ్దమే కాలేదు. ఏమిటి అలా నిలబడి పోయావు?" అంది శాంతమ్మ తల ఎత్తి కూతుర్ని చూస్తూ.

"ఏం తింటున్నారమ్మా?" కంచాలు చూస్తూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అంది చారుమతి.

తల్లి కూతుళ్ళిద్దరూ ఉప్పు, పచ్చి మిరపకాయ నంజుకుని వట్టి అన్నం తింటున్నారు. అందులోకి నేతిచుక్క కూడా లేదు.

"ఏమే, నువ్వు అన్నం తిన్నావా? నీ కోసం కంచంలో అన్నం మూత పెట్టాను. ఇంత వరకూ నీ కోసం చూసి, ఇప్పుడే మేం భోజనాలకి కూర్చున్నాం." అంది భానుమతి దృష్టిని మళ్ళిస్తూ.

"ఆ .. తినే వచ్చాను" అంది చారుమతి, తను శ్రీదేవి ఇంట్లో తిన్న పిండివంటలూ, కూరలూ జ్ఞాపకం వచ్చి, వాంతి చేసుకోవాలనిపించింది.

చారుమతి అక్కడే వంటింటి గుమ్మం మీదే కూర్చుంది. "అమ్మా! కందిపొడి వేసుకోలేక పోయావా?' అంది తల్లిని చూస్తూ.

"కడుపు నిండడానికి ఏమైతేనేమే! కంది పొడి రోజూ వేసుకుంటే కడుపు నొప్పి వస్తుంది" అంది శాంతమ్మ.

దూరంగా తనకి ఉంచిన కంచంలో నించి కొద్దిగా కూరా, ఒకపక్క కందిపొడి కనిపిస్తున్నాయి.

కందిపొడి వేసుకుంటే కడుపునొప్పి రావటం కాదు. పిల్లలకి అదికూడా లేకుండా పోతుందని తల్లి భయం.

ముసలమ్మకి పచ్చళ్ళూ, కందిపొడి పడవు. ఒక రోజు పెడితే మరునాటి నించీ కడుపునొప్పి, విరోచనాలు అవుతాయి. ఆవిడ కోసం రోజూ కొద్దిగా కూర చేస్తుంది భానుమతి. ఆవిడ తినగా మిగిలినది తమ్ముడికీ, చారుమతికీ వడ్డిస్తుంది.

'ఇలాంటి పరిస్థితులలో నేను చీరేం కొనుక్కోను? శ్రీదేవికి బహుమతి ఏమి ఇవ్వగలను?' అనుకుంది చారుమతి. సెలవులవడం వాళ్ళ ఎవరూ ప్రైవేట్లకి రావటం లేదు. ఇంటి ముందు శంకరం "గది అద్దెకు ఇవ్వబడును" అని పెద్ద బోర్డు తగిలించినా, ఎవరూ ఇంతవరకూ అద్దెకి దిగలేదు. గదికోసం వచ్చిన విద్యార్థులకీ, బ్రహ్మచారులకీ అద్దెకి ఇవ్వడానికి శాంతమ్మ అంగీకరించలేదు. 'ఎవరికో ఒకరికి ఇచ్చేయ్యాలి' అనుకుంది చారుమతి ధృడంగా.

డాబా మీద అందరూ పడకలకి చేరినప్పుడు చెప్పింది. "ఈ మారు గది కావాలని ఎవరు వచ్చినా అద్దెకి ఇచ్చెయ్యండి" అని.

డాబా మీద మనుష్యులు తక్కువై పోయి డాబా విశాలంగా కనిపిస్తూంది. మాలతి పరీక్షలవ్వగానే భగవతిని చూసి వస్తానంటూ విశాఖపట్నం వెళ్ళింది. సూర్యారావు ఖాళీ ఎప్పుడూ భర్తీ చెయ్య లేనిది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments